## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొండపల్లి: మండలంలోని నెలివాడ, కెరటాం, తమటాడ, గొల్లలపేట, బిల్లలవలస గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈఈ ఆర్.శంకరరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. బొండపల్లి రూరల్ ఫీడర్ పరిధిలోని గ్రామాల పరిసరాల్లో విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగించే పనుల నేపథ్యంలో ఈ అసౌకర్యం కలుగుతోందన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

### దరఖాస్తు చేసుకోండి

గజపతినగరం: స్థానిక డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో చేరాలనుకునే వారంతా ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ ఓ ప్రకటనలో గురువారం కోరారు. బీఎస్సీ సీబీజెడ్, బీఎస్సీ కంప్యూటర్స్, బీఏ, బీకాం కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఆసక్తి ఉన్న వారంతా కళాశాలలో చేరాలన్నారు.

### యూనిఫాం పంపిణీ



విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్న సర్పంచ్ క్రాంతికుమార్

దత్తిరాజేరు: మండలంలోని టి.భూర్జవలస గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ మంత్రి క్రాంతికుమార్ చేతుల మీదుగా గురువారం యూనిఫాం పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ బడులు ఎంతో బాగుపడ్డాయని, దీంతో పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు అందేలా ఉపాధ్యాయులు చూడాలని కోరారు.

### కౌలురైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వండి



వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

గజపతినగరం: కౌలురైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన మండలంలోని పురిటిపెంట గ్రామ సచివాలయ సిబ్బందిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల ప్రచార సమయంలో కౌలురైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందజేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని, ఆ మాట నిలబెట్టుకోవాలని, అలాగే వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సౌకర్యంక కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

### రాయితీపై బియ్యం, కందిపప్పు అమ్మకాలు



బియ్యం, కందిపప్పు అమ్మకాలు ప్రారంభిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్

కొత్తవలస: స్థానిక కొల్లా సత్యనారాయణ, విన్నకోటి చిట్టిబాబులకు చెందిన రిటైల్ షాపుల్లో రాయితీపై బియ్యం, కందిపప్పు అమ్మకాలను తహసీల్దార్ చంద్రశేఖర్ గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో కిలో దేశివాళీ కందిపప్పు రూ.181 ఉండగా, రాయితీపై రూ.160కే అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే స్టీమ్డ్ బీపీటీ, సోనామసూరి రకం బియ్యం కిలో రూ 55.85 ఉండగా, రూ.49లకే అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ కె.ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

### కార్మికులకు అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం మద్దతు

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం గ్రామ సమీపంలోని జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ కర్మాగారం కార్మికులకు మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం మద్దతు తెలిపింది. ఈ మేరకు ఆ సంఘ ప్రతినిధులు కొంతమంది కర్మాగారం వద్ద రిలే నిరాహార దీక్ష చేస్తున్న కార్మికుల వద్దకు వెళ్లి, సంఘీభావం తెలిపారు. కొంత నగదును సాయం చేశారు. మే 17వ తేదీన ముడిసరుకుల కొరత కారణం సాకుతో అర్ధాంతరంగా లాకౌట్‌ను ప్రకటించి, కర్మాగారాన్ని మూసివేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి కర్మాగారం ప్రధాన గేటు వద్ద కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపడుతున్న విషయం గమనార్హం కాగా కార్మికులకు అండగా నిలవడం చాలా ఆనందంగా ఉందని సంఘ ప్రతినిధులు తెలిపారు.

## హెల్మెట్ ధారణ.. ప్రాణాలకు రక్షణ

- అవగాహన ర్యాలీలో న్యాయమూర్తి కనకలక్ష్మి



బొండపల్లి: అవగాహన ర్యాలీలో న్యాయమూర్తి కనకలక్ష్మి, న్యాయవాదులు

బొండపల్లి: వాహనం నడిపేటప్పుడు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని గజపతినగరం ఫస్ట్‌క్లాస్ సివిల్ కోర్టు న్యాయమూర్తి బి.కనకలక్ష్మి అన్నారు. మండలంలోని బోడసింగిపేట 26వ నంబర్ జాతీయ రహదారిపై మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో హెల్మెట్ ధారణ, దాని ద్వారా కలిగే రక్షణపై అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. చాలాచోట్ల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్న ద్విచక్ర వాహనదారుల్లో ఎక్కువ మంది హెల్మెట్ లేని కారణంగా మరణిస్తున్నారన్నారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని,ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, పరిమిత వేగంతో వెళ్లాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాపాక సాయికుమార్, జెర్రిపోతుల జగదీష్ పాల్గొన్నారు.

గజపతినగరం: స్థానిక కోర్టు ఆవరణ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు హెల్మెట్ వాడకం, దాని ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూ గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గజపతినగరం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బి.కనకలక్ష్మి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే వాహన యజమానులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని, మనం ధరించే హెల్మెట్ మన ప్రాణాలను కాపాడుతుందన్న విషయం అందరూ గుర్తుంచుకోవాలన్నారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని, పరిమిత వేగంతో వాహనాలు నడపాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పి.శ్రీనివాసరావు, సూర్యనారాయణ, జె.జగదీష్ పాల్గొన్నారు.

చీపురుపల్లి: హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం వల్లే రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్న వారిలో 80 శాతం మంది ద్విచక్ర వాహనదారులే ఉన్నారని జూనియర్ సివిల్ జడ్జి వై.ప్రేమలత అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హెల్మెట్ వాడకం ప్రయోజనాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. కోర్టు దగ్గర నుంచి ప్రారంభమైన ర్యాలీ లావేరు రోడ్డు, మెయిన్ రోడ్డు, మూడు రోడ్ల జంక్షన్ తదితర ప్రాంతాల్లో జరిగింది. హెల్మెట్ ధారణ ప్రాణాలకు రక్షణ, హెల్మెట్ ధరించండి ప్రాణాన్ని కాపాడుకోండి అని నినాదాలు చేశారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి, ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ధరించకపోతే మోటార్ వెహికల్ చట్టం ప్రకారం రూ.1000 జరిమానా విధించడంతో పాటు మూడు నెలల పాటు లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు, ప్రధానోపాధ్యాయుడు కె.చంద్రశేఖర్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: మండల కేంద్రంలో హెల్మెట్ ధారణ, దాని ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూ గురువారం ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయచంద్ర, ఇతర న్యాయవాదులు పాల్గొని, హెల్మెట్ వాడకం ద్వారా కలిగే లాభాలపై వాహనదారులకు చైతన్యం కల్పించారు. ద్విచక్ర వాహనదారులు వాహనంతో బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, తద్వారా మనకు రక్షణ కలుగుతుందన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే శిక్షార్హులవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు దేవి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



చీపురుపల్లి: అవగాహన ర్యాలీలో న్యాయమూర్తి ప్రేమలత, న్యాయవాదులు, తదితరులు



గజపతినగరం: హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న మెజిస్ట్రేట్ కనకలక్ష్మి



కొత్తవలస జంక్షన్‌లో అవగాహన కల్పిస్తున్న జడ్జి విజయచంద్ర

## తక్షణమే వేతనాలు చెల్లించాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి రాములు

బొండపల్లి: ఉపాధి హామీ పథకం వేతనదారులకు ప్రభుత్వం చెల్లించాల్సిన వేతనాలను తక్షణమే చెల్లించాలని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. ఇదే విషయమై మండల కేంద్రంలో డిప్యూటీ తహసీల్దార్ పి.హరిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలోని 4 వేల వేతనదారులకు మూడు వారాల వేతనాలను చెల్లించాల్సి ఉందని, ఈ నిధులను వెంటనే విడుదల చేసేలా చొరవ తీసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా, దేవదాయ ధర్మాదాయ శాఖ భూములు సాగు చేస్తున్న రైతుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 20వ తేదీన జిల్లా కేంద్రంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నామని, దీనికి పెద్దఎత్తున దేవదాయ ధర్మాదాయ భూములు సాగు చేస్తున్న రైతులు హాజరుకావాలని కోరారు. గుర్తింపుకార్డు ఉన్న ప్రతీ కౌలురైతుకు ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని రాయితీలు, సౌకర్యాలు అందేలా చూడాలని డిప్యూటీ తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జి.రాంబాబు, టి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులు తీరు మార్చుకోవాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ సోమేశ్వరరావు



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సోమేశ్వరరావు

శృంగవరపుకోట: ఉద్యోగులు తీరు మార్చుకోవాలని, మండల పరిషత్ అధ్యక్షుడు అనే విషయం గుర్తించి, గౌరవించడం నేర్చుకోండి అని ఎంపీపీ సోమేశ్వరరావు హితవు పలికారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎ.ఎ.ఎ.సాంబశివరావు నేతృత్వంలో మండల సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజులు వైద్య సిబ్బంది పనితీరుపై మండిపడ్డారు. గిరిజన గ్రామాల్లో విషజ్వరాలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయని, ఏం చేస్తున్నారని పీహెచ్‌సీ వైద్యురాలు శిరీషను ప్రశ్నించారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నీల మాట్లాడుతుండగా ఓపీలు ఇవ్వడంలో జరుగుతోందని, తరచూ ఇక్కడి కేసులను రిఫర్ చేస్తున్నారని, ఆస్పత్రిలో స్కానింగ్ చేయడం లేదని, 108 అంబులెన్స్ డ్రైవర్లు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఎంపీటీసీలు శేఖర్, బషీర్‌లు ఫిర్యాదు చేశారు. గ్రామాల్లో విచ్చలవిడిగా నడుస్తున్న బెల్టుషాపులను నివారించాలని ఎస్ఈబీ సీఐని ఎంపీపీ, వైస్ ఎంపీపీలు ఆదేశించారు. రేషన్ సరుకుల తూకంలో తేడాలు వస్తున్నాయని తమకు ఫిర్యాదులు వస్తున్నాయని, అటువంటి తప్పులు జరగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఎంపీపీ కోరారు. అనంతరం శాఖల వారీగా సమస్యలపై చర్చించి, పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, సీఎస్‌డీటీ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ సుధారాజు, ఎంపీడీవో సాంబశివరావు, ఈవోపీఆర్‌డీ లక్ష్మి, ఎంఈవో నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మేలు జరిగేలా పనిచేయాలి



మండల సర్వసభ్య సమావేశంలో వైద్యాధికారి దీప్తిని సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఇతర ప్రజాప్రతినిధులు

- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): ప్రజలకు మేలు జరిగేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సూచించారు. గరివిడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మీసాల విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆయన.. శాఖల వారీగా అధికారులతో సమస్యలపై చర్చించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, వాటి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు ఆయన సూచించారు. ఈ ఖరీఫ్ సీజనల్‌లో విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని, రైతులకు వాటిని అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారులకు తెలిపారు. కౌలురైతులకు ప్రభుత్వం నుంచే అందే అన్ని సదుపాయాలు అందేలా చూడాలన్నారు. మండలంలోని కుమరాం, గొట్నంది గ్రామాల్లో పడిపోయిన విద్యుత్ స్తంభాలను సరిచేయాలన్నారు. తాటిగూడ, దేవాడ గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి అదనంగా ఓ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలన్నారు. తాటిగూడలో జరిగిన పౌష్టికాహార పంపిణీ కార్యక్రమానికి సర్పంచ్, ఎంపీటీసీలను ఆహ్వానించకుండా అగౌరపరచారని తాటిగూడ పీఏసీఎస్ అధ్యక్షుడు ఎర్ల అప్పారావు సమావేశం దృష్టికి తీసుకురాగా, రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ప్రజలకు మంచి జరగాలంటే ప్రజాప్రతినిధులకు అధికారులకు సహకరించాలని కోరారు. ప్రజలకు మంచి సేవలందించినందుకు గాను రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న గరివిడి పీహెచ్‌సీ వైద్యాధికారి దీప్తి, వైద్య సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించి, సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదనరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనువాసరావు, వైస్ ఎంపీపీలు రామకృష్ణరాజు, శ్రీరాములనాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### బిందుసేద్యంతో సాగునీరు ఆదా



డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ

వేపాడ: బిందు, తుంపరసేద్యంతో సాగునీరు ఆదా అవుతుందని, ప్రతీ రైతు ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న బిందు, తుంపర సేద్య పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపీ పీడీ పి.ఎస్.వి.లక్ష్మీనారాయణ కోరారు. మండలంలోని వల్లంపూడి గ్రామంలో పరమేశ్వరి అనే వ్యక్తికి రాయితీపై ఇచ్చిన డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం ఆ పరికరాలను వినియోగిస్తూ పండ్లు, కూరగాయలు సాగు చేయడాన్ని అభినందించి, ప్రోత్సహించారు. చిన్న, సన్నకారు రైతులంతా డ్రిప్ ఇరిగేషన్‌ను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ రమేష్ పాల్గొన్నారు.

### నేడు ఆశీల వేలంపాట

కొత్తవలస: స్థానిక సంతమార్కెట్ రోజువారీ ఆశీలకు సంబంధించి, వేలంపాటను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమణయ్య ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు రూ.50 వేలు ధరావత్తు చెల్లించాలన్నారు.

## సంక్షిప్తంగా...

**సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన**

వేపాడ: మండలంలోని కృష్ణారాయుడుపేటలో సేంద్రియ ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తయారు చేసే జీవామృతం, కషాయాల తయారీపై గురువారం అవగాహన కల్పించారు. ఏ పంటకు ఏ తెగులు సోకితే ఏ ఎరువు వేయాలి, ఏ జీవామృతం, కషాయం వేయాలన్న విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పైడిబాబు, ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ సన్యాసమ్మ, యూనిట్ ఇన్‌చార్జ్ నారాయణమ్మ పాల్గొన్నారు.

**సర్టిఫికెట్ల ప్రదానం**

శృంగవరపుకోట: స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లకు బి సర్టిఫికెట్లను గురువారం ప్రదానం చేశారు. వివేకానంద కళాశాలకు చెందిన 63 మంది, కొత్తవలస వాగ్దేవి కళాశాలకు చెందిన 18 మంది విద్యార్థులకు వివేకానంద విద్యాసంస్థల యజమాని సీహెచ్‌ఆర్‌కే ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు, ప్రోగ్రామింగ్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావులు కలిసి క్యాడెట్లకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కేర్ టేకర్ పూజిత పాల్గొన్నారు.

**ఓటుహక్కును సద్వినియోగం చేసుకోండి**

వేపాడ: ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని వక్తలు కోరారు. స్థానిక శ్రీ విక్టరీ హైస్కూల్‌లో ఓటుహక్కు వినియోగంపై గురువారం అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ దాలినాయుడు, డైరెక్టర్ రాఘవ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, మన భవిష్యత్‌ను మరింత బాగు చేసుకునేందుకు రాజ్యాంగం కల్పించిన హక్కు ఓటుహక్కు అని వక్తలు తెలిపారు. అనంతరం ఓటు ఏ విధంగా వినియోగించుకోవాలో ప్రయోగ పూర్వకంగా విద్యార్థులకు వివరించారు.

**విచారణ**

గంట్యాడ: మండలంలోని పెంటశ్రీరాంపురానికి చెందిన ఉపాధి హామీ పథకం సీనియర్ మేట్ కరక ఇందిర పనితీరుపై ఆ శాఖ అధికారులు గురువారం విచారణ చేపట్టారు. సరిగ్గా ఏడాది క్రితం సీనియర్ మేట్‌గా ఆమె నియామకం జరగ్గా, పనుల్లోకి రాని వేతనదారులకు మస్తర్లు వేయడం, పనులు కల్పించేందుకు ఆమె డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఫిర్యాదులు రాగా ఇప్పుడు విచారణ ప్రారంభించినట్లు సమాచారం. అయితే ఇదంతా అధికార పార్టీ కుట్రేనని పలువురు అంటున్నారు. విచారణ చేపట్టిన వారిలో ఏపీడీ శారదాదేవి, గంట్యాడ ఇంజినీరింగ్ కన్సల్టెంట్ డి.జోగారావు, సాంకేతిక సహాయకుడు కేశవరావు ఉన్నారు.

**సత్కారం**

చీపురుపల్లి: నేత్రదానంపై విస్తృత అవగాహనతో పాటు కార్నియా సేకరణలో రెండు జిల్లాల్లో ఉత్తమ సేవలందించిన పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బి.వి.గోవిందరాజులును గురువారం ఘనంగా సత్కరించారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కళామందిర్‌లో శ్రీకాకుళం జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో గోవిందరాజులు చేస్తున్న సేవను ప్రశంసించారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో గ్రామస్థాయిలో యాభై వేలకు పైగా నేత్రదానం అంగీకార పత్రాలను సేకరించారన్నారు. అలాగే మరణించిన వారిలో దాదాపు 300 మంది నుంచి కార్నియా సేకరించి, ఎంతోమందికి చూపును ప్రసాదించారన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జేసీ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



బొండపల్లి: అంగన్‌వాడీ కేంద్రంలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మండల ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్



దత్తిరాజేరు: అంగన్‌వాడీ కేంద్రం సందర్శనలో మండల స్థాయి అధికారులు



జామి: మండల కేంద్రంలోని పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న అధికారులు



చీపురుపల్లి: నిమ్మలవలసలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న నోడల్ అధికారి రాజ్యలక్ష్మి

బొండపల్లి: గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా గుర్తించిన సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎస్.వి.కె.దుర్గాప్రసాద్ సూచించారు. మండలంలోని గొట్లాం గ్రామంలో గ్రామ సందర్శన కార్యక్రమం గురువారం నిర్వహించగా, మండల స్థాయి అధికారులంతా ఆ కార్యక్రమానికి హాజరై, ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామసచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, అక్కడి సమస్యలపై ఆరాతీశారు. త్వరితగతిన సమస్యలు పరిష్కారమయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.హనుమంతురావు, ఎంపీడీవో ఎస్.హరిహరరావు, సర్పంచ్ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

**తూతూమంత్రంగా..**

దత్తిరాజేరు: మండలంలోని విజయరాంపురంలో గురువారం నిర్వహించిన గ్రామ సందర్శన కార్యక్రమం తూతూమంత్రంగా సాగింది. ఎంపీడీవో చంద్రకుమారి, తహసీల్దార్ సుదర్శన్, ప్రజాప్రతినిధులు కలిసి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, రేషన్ డిపోలను సందర్శించి, అక్కడి సేవలపై ఆరాతీశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.సింహాచలం, పంచాయతీ అధికారి వాణిశ్రీ, ఏఈవో లీలాకృష్ణ పాల్గొన్నారు.

జామి: సమస్యల పరిష్కారానికే గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సెట్విజ్ ఏవో కృష్ణమూర్తి తెలిపారు. గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా జామి గ్రామానికి మండల స్థాయి అధికారుల బృందంతో వెళ్లిన ఆయన.. తొలుత సచివాలయం-3లో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమై, ప్రజాసమస్యలు-వాటి పరిష్కార చర్యలపై చర్చించారు. గ్రామంలో శ్మశానవాటికకు స్థలం కేటాయింపు, రంభ వీధిలో డ్రైనేజీ నిర్మాణాల తదితర అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఎంపీడీవో తిరుమలరావు, తహసీల్దార్ రాంబాయి, సర్పంచ్ లక్ష్మి పాల్గొన్నారు.

చీపురుపల్లి: గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా మండలంలోని నిమ్మలవలస గ్రామానికి నోడల్ అధికారి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎం.రాజ్యలక్ష్మి నేతృత్వంలో అన్ని శాఖల మండల స్థాయి అధికారులు గురువారం వెళ్లి, అక్కడి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలను సందర్శించి, అక్కడి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి, అక్కడి సిబ్బంది పనితీరు, లబ్ధిదారులకు అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీ అమలును తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.శ్వేత, తహసీల్దార్ ఎస్.ప్రసాద్, ఈవోపీఆర్‌డీ అన్నపూర్ణదేవి పాల్గొన్నారు.

గుర్ల: ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మండల ప్రత్యేకాధికారి జి.పెంటోజీరావు సూచించారు. గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆనందపురం గ్రామానికి అధికార బృందంతో వెళ్లిన ఆయన.. సచివాలయం, రైతు భరోసా కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించి, పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం పాఠశాలకు వెళ్లి, విద్యార్థులకు అందిస్తున్న భోజనంను పరిశీలించారు. ఎంపీడీవో వెంకటరమణ, తహసీల్దార్ రమాదేవి పాల్గొన్నారు.

**ఇలా ఉంటే ఎలా తింటారు..?**

గంట్యాడ: అధికారులు గ్రామానికి వస్తారని తెలిసి కూడా భోజనం ఇంత అధ్వానంగా ఉంటే ఎలా.. పిల్లలు ఎలా తింటారని అంగన్‌వాడీ, పాఠశాలల సిబ్బందిపై మండల నోడల్ అధికారి జి.ఉమాపరమేశ్వరి మండిపడ్డారు. గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా మండలంలోని జగ్గాపురానికి వెళ్లిన ఆమె.. అక్కడి పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, పిల్లల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. రుచికరమైన భోజనం వండిపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఎంపీడీవో భవాని పాల్గొన్నారు.

**సాదాసీదాగా గ్రామ సందర్శన..**

లక్కవరపుకోట/కొత్తవలస: ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన గ్రామ సందర్శన కార్యక్రమం సాదాసీదాగా జరుగుతోంది. కార్యక్రమంలో భాగంగా లక్కవరపుకోట మండలంలోని భీమాళి, కొత్తవలస మండలంలోని చిన్నరావుపల్లి గ్రామాల్లో ఆయా మండలాల ప్రత్యేకాధికారులు ప్రేమ్‌కుమార్, గణపతిరావులు గురువారం పర్యటించి, అక్కడి అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలు, వెల్‌నెస్ కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. అనంతరం గ్రామసభ నిర్వహించి, పలు సమస్యలపై అర్జీలు స్వీకరించారు. తహసీల్దార్‌లు ప్రసాద్ రావు, చంద్రశేఖర్, ఎంపీడీవోలు కె.రూపేష్, రమణయ్య, వైస్ ఎంపీపీ ఎం.శ్రీనురాజు, సర్పంచ్‌లు కృష్ణ, దేముడు పాల్గొన్నారు.




గుర్ల: సచివాలయం వద్ద మొక్కలు నాటుతున్న మండల ప్రత్యేకాధికారి పెంటోజీరావు




చీపురుపల్లి రూరల్(గరివిడి): అంగన్‌వాడీ కేంద్రం సందర్శనలో పశుసంవర్ధక శాఖ జేడీ రమణ

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కోడూరు గ్రామంలో గ్రామ సందర్శన కార్యక్రమం గురువారం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ జేడీ, మండల ప్రత్యేకాధికారి వై.వి.రమణలు ఈ కార్యక్రమానికి హాజరై, సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలను సందర్శించి, ప్రజలకు అందిస్తున్న సేవలపై సమీక్షించారు. అనంతరం పాఠశాలను సందర్శించి, విద్యార్థుల విద్యాసామర్థ్యాలను అంచనా వేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.మధుసూదనరావు పాల్గొన్నారు.


శృంగవరపుకోట: మండలంలోని కొత్తూరులో నోడల్ అధికారి పి.మురళీకృష్ణ నేతృత్వంలో గ్రామ సందర్శన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి పాఠశాల, సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, రేషన్ డిపో, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరాతీశారు.




గంట్యాడ: మాట్లాడుతున్న నోడల్ అధికారి ఉమాపరమేశ్వరి



కొత్తవలస: చిన్నరావుపల్లిలో గ్రామ సందర్శనలో ప్రజాసమస్యలపై చర్చిస్తున్న అధికారులు



లక్కవరపుకోట: భీమాళి గ్రామసభలో పాల్గొన్న మండల స్థాయి అధికారులు



శృంగవరపుకోట: విద్యార్థుల విద్యాసామర్థ్యం పరిశీలిస్తున్న నోడల్ అధికారి మురళీకృష్ణ